సాక్షి
గుంటూరు
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



తెనాలిలో హిందీ పరీక్షలు

తెనాలి అర్బన్: కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో హిందీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 230 మంది విద్యార్థులు హాజరయ్యారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,02,082 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 3,18,887 క్యూసెక్కులు వదులుతున్నారు.



లాంచీస్టేషన్ ఆదాయం రూ.78,000

విజయపురిసౌత్: నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. దీంతో లాంచీ స్టేషన్‌కు రూ.78,000 ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న పత్రికలపై, ఎడిటర్లపై, రిపోర్టర్లపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణం. సాక్షి దినపత్రిక నిజాలను వెలికి తీస్తోందనే అక్కసుతో కూటమి ప్రభుత్వం దారుణాలకు దిగుతోంది. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై, ఇతర విలేకర్లపై కేసులు నమోదు చేసింది. ప్రభుత్వంపై వ్యతిరేకతను దినపత్రిక ద్వారా ప్రజలకు తెలియజేసిన సాక్షి పత్రికపై అక్కసు వెళ్లగక్కడం మంచి పరిణామం కాదు.

– బొల్లా బ్రహ్మనాయుడు,
మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు



పత్రికా స్వేచ్ఛను హరించడం హేయం



ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభం. సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి కేసులు నమోదు చేయడం అత్యంత దారుణం. ప్రభుత్వ లోపాలు, ప్రజల సమస్యలను తెలియజేసే క్రమంలో వ్యతిరేక వార్తలు రావడం సహజం. వాటిలో తప్పొప్పులను బేరీజు వేసుకోవాలి తప్పా అక్రమ కేసులు బనాయించడం హేయం. ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు వంటిది. ఇప్పటికైనా కూటమి సర్కారు తీరు మార్చుకోవాలి.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

అక్షరంపై కక్ష సాధింపు తగదు



అక్షరం ప్రశ్నిస్తుంది.. అక్రమం ఎక్కడుంటే అక్కడ గర్జిస్తుంది. ఒక అక్షరాన్ని బహిష్కరిస్తే లక్ష పుట్టుకొస్తాయి. పత్రికా స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కు. కూటమి ప్రభుత్వం దాన్ని కాల రాస్తోంది. సాక్షి మీడియాతో పాటు ఎడిటర్, జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. తప్పులు ఎత్తి చూపుతున్న సాక్షి దినపత్రిక, ఎడిటర్, పాత్రికేయులపై కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. సమాజంలో ప్రతి ఒక్కరూ పత్రికా సేచ్ఛను పరిరక్షించాలి.

–దొంతిరెడ్డి వేమారెడ్డి,
వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- ఆదివారం బాధ్యతల స్వీకరణ
- బెటర్ పోలీసింగ్‌కు కృషి



నగరంపాలెం: జిల్లాలో రౌడీయిజం, మాదకద్రవ్యాలు, మహిళలపై నేరాలను కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని నూతన ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. ఆదివారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత పోలీసుల నుంచి గౌరవ వందనం, స్థానిక దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జిల్లా ప్రజలకు 24 గంటలు పోలీస్ యంత్రాంగం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతానని తెలిపారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. బెటర్ పోలిసింగ్ కోసం అధికారులు, సిబ్బందితో కలిసి విధులు నిర్వహిస్తానని చెప్పారు. అధికార కార్యక్రమాల మినహా మిగతా సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు. రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాకు ఎస్పీగా నియమించిన ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబునాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), రవికుమార్ (ఎల్/ఓ), హనుమంతు (ఏఆర్), పలువురు డీఎస్పీలు, సీఐలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం పోలీస్ అధికారులతో సమావేశ మందిరంలో ఎస్పీ భేటీ అయ్యారు.

రాచనగరు రహదారులు ఛిద్రం



తాడికొండ: రాజధాని అమరావతికి వెళ్లే ప్రధాన రహదారులు ఛిద్రం అయ్యాయి. అటు ప్రయాణికులు ఇటు వీఐపీలు, వీవీఐపీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు రాజధాని ప్రాంతం ముంపునకు గురైంది. వాగులు ఉప్పొంగాయి. నీరు నిలిచి ప్రధాన రహదారి గుంతల మయంగా తయారైంది. పెదపరిమి నుంచి తుళ్లూరు వరకు ఏర్పడిన భారీ గుంతలు అటు వాహనదారులు, ఇటు నిత్యం రాజధానికి రాకపోకలు సాగించే సచివాలయ, హైకోర్టు ఉద్యోగులు, జడ్జీలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. నెల రోజులుగా ఈ దుస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం గుంతలలో ఫ్లైయాష్ డస్ట్ కూడా వేసిన దాఖలాలు లేని కారణంగా పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రాచనగరుకు వెళ్లే రహదారులకు కనీస మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

ఐజీని కలిసిన జిల్లా ఎస్పీ



నగరంపాలెం: స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠిని ఆదివారం గుంటూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. సమర్థంగా విధులు నిర్వర్తించి, ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని ఐజీ జిల్లా ఎస్పీకి సూచించారు.

పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం 5,009 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి నీటి విడుదల నిలిపివేశారు. బ్యాంక్ కెనాల్‌కు 988 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 342, పశ్చిమ కాలువకు 131, నిజాంపట్నం కాలువకు 297, కొమ్మూరు కాలువకు 1,483 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,57,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



కంకరగుంట ఆర్‌ఓబీ వద్ద నీటి ప్రవాహం



మూడు వంతెనలు వద్ద ..



52వ డివిజన్‌లో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు



లక్ష్మీపురంలో నీట మునిగిన రహదారి

చిగురుటాకులా వణికిన గుంటూరు నగరం

కుంభవృష్టి

- రెండో రోజు కురిసిన భారీ వర్షం
- నీట మునిగిన రహదారులు
- నగర జీవనానికి ఆటంకం
- పలుచోట్ల ఇళ్లలోకి చేరిన నీరు
- పలుచోట్ల అండర్‌పాస్‌లు, ఆర్‌ఓబీలు మునక



బ్రాడీపేట 4/18లో నీట మునిగిన ఇళ్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని వరుణుడు ముంచెత్తాడు. శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం నుంచి తెరుచుకోనేలోపు ఆదివారం కూడా కుంభవృష్టి కురిసింది. మధ్యాహ్నం 3.30గంటల నుంచి సుమారు మూడు గంటల పాటు వర్షం ఆగకుండా కురిసింది. నగరంలోని మెజార్టీ ప్రాంతాలు నీటమునిగిపోయాయి. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగి పొర్లాయి. వీధుల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర ప్రజలు అవస్థలు పడ్డారు.

కాలువలను తలపించిన వీధులు

నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ కాలువలను తలపించాయి. డ్రెయిన్లు, రోడ్లు ఏకమయ్యాయి. ముఖ్యంగా ముత్యాలరెడ్డినగర్, ఏటీ అగ్రహారం, ఆర్టీసీ బస్టాండ్, మార్కెట్, బొంగరాలబీడు, నగరంపాలెం, విద్యానగర్, మూడు వంతెనలు, కంకరగుంట అండర్‌పాస్, ఓల్డ్ క్లబ్ రోడ్డు, నగరపాలక సంస్థ కార్యాలయం పరిసర ప్రాంతాలు, కేవీపీ కాలనీ, కొత్తపేట, బృందావన్ గార్డెన్స్, కోబాల్డ్‌పేట, మల్లికార్జునరావుపేట, శ్రీనగర్, చుట్టుగుంట, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగి పొర్లాయి. వీధుల్లో భారీ ఎత్తున ప్రవాహంలా వర్షపు నీరు పారింది. వాహనదారులు అష్టకష్టాలు పడ్డారు. నీటిలో మునిగి వాహనాలు మొరాయించాయి.



బృందావన్ గార్డెన్స్ ఏరియాలో నీటి ప్రవాహం

నీట మునిగిన ఇళ్లు

భారీ వర్షానికి నగరంలోని ముత్యాలరెడ్డి, మురికిపేట, బ్రాడీపేట తదితర ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల డ్రెయిన్లు మెరకలో ఉన్నాయి. రోడ్డు పల్లంగా ఉండటంతో వర్షం పడిన ప్రతి సారి ఇదే విధంగా నీట మునిగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేదు. వ్యర్థాలు అడ్డం పడి పూడిపోయాయి.

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ వృథా

వర్షాకాలంలో అవస్థల దృష్ట్యా రూ. 4 కోట్లతో వేసవిలో మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ చేపట్టినా ఫలితం లేదు. డ్రెయిన్లలో పూడిక పనులను తూతూమంత్రంగా చేయడంతో వర్షం వస్తే గుంటూరు నగరంలో రోడ్లన్నీ కాలువలను తలపిస్తున్నాయి. చిన్న వర్షం కురిసినా జన జీవనం స్తంభించిపోతోంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి డ్రెయిన్లను సక్రమంగా నిర్వహించడంతో పాటు లేనిచోట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





నగరంలోని పలు సెంటర్లలో మునిగిన దుకాణాలు



అరండల్‌పేట షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్‌లో నీరు

యురేనియం కాలుష్యంపై ఆందోళన వద్దు: కలెక్టర్



గుంటూరు రూరల్: తురకపాలెంలో యురేనియం కాలుష్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తురకపాలెంలో ఇటీవల మరణాలు సంభవించిన నేపథ్యంలో సెకండరీ హెల్త్ సంచాలకురాలు డాక్టర్ సిరి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ గ్రామాన్ని సందర్శించిందన్నారు. గ్రామంలోని నేల, నీటి నమూనాలను సేకరించి కాలుష్య కారణాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారని ఆమె పేర్కొన్నారు. గ్రామంలో ఎనిమిది నీటి శాంపిళ్లను కమ్యూనిటీ వాటర్ సోర్సులు, మరణించిన వారి ఇళ్ల బోరు బావుల నుంచి సేకరించారని ఆమె తెలిపారు. వీటిలో బయాలజికల్ కాలుష్యం తేలిందని వెల్లడించారు. కొన్ని నమూనాలలో ఏరోబిక్ మైక్రోబయల్ కౌంట్ 4000 సీఎఫ్‌యూ/ఎంఎల్ నుంచి 9000 సీఎఫ్‌యూ/ఎంఎల్ వరకు నమోదైందని వివరించారు. కొన్ని మీడియా కథనాల్లో తురకపాలెం భూగర్భ జలాల్లో యురేనియం కలుషితం ఉందని పేర్కొనడం జరిగిందని పేర్కొన్నారు. తాగు నీటిలో యురేనియం పరిమితి భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్), ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం లీటరుకు 30 మైక్రో గ్రాములు (0.03 ఎంజీ)గా ఉందన్నారు. అదనంగా, పరమాణు శక్తి నియంత్రణ మండలి (ఏఈఆర్‌బీ) అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని లీటరుకు 60 మైక్రో గ్రాములు (0.06 ఎంజీ) వరకు పరిమితిని సూచిస్తోందని వెల్లడించారు.

పరిమితికి లోపలే నమోదు

తురకపాలెంలో సేకరించిన ఎనిమిది నీటి నమూనాల్లో నాలుగింటిలో యురేనియం ఆనవాళ్లు అనుమతించిన పరిమితి లోపలే నమోదయ్యాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. బీ-2 శాంపిల్ – 0.001 మైక్రోగ్రాములు, బీ-4 శాంపిల్ 0.013 మైక్రో గ్రాములు, బీ-5 శాంపిల్ – 0.011 మైక్రో గ్రాములు, బీ -6 శాంపిల్ 0.005 మైక్రోగ్రాములు వరకూ నమోదయ్యాయని వివరించారు. మిగిలిన నాలుగు నమూనాల్లో యురేనియం ఆనవాళ్లు 0.001 మైక్రో గ్రాముల కంటే తక్కువగా ఉన్నట్లు తేలిందని వివరించారు.

దొంగలు.. బాబోయ్ దొంగలు

- వరుస చోరీలతో గుంటూరు నగర ప్రజలు బెంబేలు
- పెరిగిన బైక్ చోరీలు
- మొద్దునిద్రలో పోలీసులు
- అలంకారప్రాయంగా మారిన సీసీఎస్
- భారీ చోరీల్లో సైతం నో రిక "వర్రీ"

పట్నంబజారు: నగరంలో రోజురోజుకీ చోరీలు పెరిగిపోతున్నాయి. దొంగలు అడ్డూఅదుపు లేకుండా నివాసాలు కొల్లగొడుతున్నా పోలీసులు మొద్దునిద్ర వీడటం లేదు. బాధితులు లబోదిబోమంటున్నారు. స్టేషన్‌కు వెళుతున్నా అదిగో చూస్తాం.. ఇదిగో చేస్తాం! అని చెప్పటం తప్పా, చోరీ ఘటనలపై పట్టించుకుంటున్న పాపాన పోవటం లేదనే ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

సీసీఎస్ నిస్తేజం

చోరీల నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) సైతం అలంకారప్రాయంగా మారింది.. ఇటీవల రెండు చోరీలను మాత్రమే ఛేదించారు. విద్యానగర్‌లో కాకాని చెందిన వ్యక్తి చేసిన చోరీ, ఒక చైన్ స్నాచింగ్ ముఠాను మాత్రమే పట్టుకున్నారు. ఈ రెండు ఘటనల్లో ఒకే టీం వారిని పట్టుకున్నారని తెలుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు సుమారు 50 మంది వరకు సీసీఎస్‌కు కేటాయించినప్పటికీ ఫలితం లేదు. వివిధ రకాల అటాచ్‌మెంట్‌లు, సీసీఎస్ అధికారులకు కావాల్సిన వారిని పిలించుకుని అక్కడ పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ విధంగా వ్యవహరిస్తే , చోరీలు నియంత్రణ ఎలా సాధ్యపడుతుందనే వాదనలు వినవస్తున్నాయి. ఇప్పుడు సీసీఎస్ స్టేషన్‌లో 20 నుంచి 25 మంది వరకు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని తెలుస్తోంది. చిన్నాచితకా చోరీల్లో నిందితులను తప్పా భారీ కేసుల్లో సీసీఎస్ అధికారులు, సిబ్బంది కూడా ఎటువంటి పురోగతి సాధించలేకపోతున్నారు.



పాత గుంటూరులోని ఓ ఇంటిలో దొంగలు చిందరవందరగా పడేసిన వస్తువులు (ఫైల్)

క్రైం పార్టీలను ఏర్పాటు చేస్తాం

ప్రత్యేక క్రైం పార్టీలను ఏర్పాటు చేసి జరిగిన చోరీలను ఛేదించేందుకు దృష్టి సారిస్తాం. పలు బందోబస్తులు కారణంగా సిబ్బంది అందుబాటులో లేరు. త్వరితగతిన నిందితులను పట్టుకుని సొత్తు రికవరీ చేస్తాం.

– షేక్ అబ్దుల్ అజీజ్ (డీఎస్పీ, గుంటూరు ఈస్ట్)

గస్తీకి సుస్తీ

పోలీసుల గస్తీకి సుస్తీ చేయడంతోనే చోరీలు అధికమైపోయాయని వాదనలు లేకపోలేదు. పాత గుంటూరు పరిధిలో రెండు రోజుల వ్యవధిలో మూడు భారీ చోరీలు, పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఒకే రోజులో విద్యానగర్‌లో రెండు భారీ చోరీలు ప్రజలను కలవరపెడుతున్నాయి. విద్యానగర్‌లో జరిగిన రెండు చోరీల్లో ఒక దానిలో అనుమానితులను బాధితులు స్పష్టంగా తెలియజేయడంతో త్వరితగతిన పట్టుకున్నారనే విమర్శలు ఉన్నాయి. రాత్రిపూట సరిగా గస్తీ లేకపోవటం వలనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

దొంగల స్వైరవిహారం

- గుంటూరు నగరంలోని పాత గుంటూరు పోలీసుస్టేషన్ పరిధిలోని సత్యనారాయణస్వామి గుడి బజారులో నివసించే పర్వతం దివ్య, శ్రీరామచంద్రం గత నెల 7న కుటుంబాలతో కలిసి తిరుపతి వెళ్లారు. తిరిగి రెండు రోజుల తరువాత ఇంటికి వచ్చారు. తలుపులు పగులకొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా దివ్య నివాసంలో 82 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి, శ్రీరామచంద్రం నివాసంలో 42 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి వస్తువుల చోరీకి గురయ్యాయి.
- తమ్మా రంగారెడ్డి నగర్‌లో నివాసం ఉండే సరస్వతి పనులు నిమిత్తం బయటకు వెళ్లి సాయంత్రానికి వచ్చారు. పట్టపగలే ఆమె నివాసంలో సుమారు 100 గ్రాములు బంగారం, రూ 10లక్షల నగదు పోయింది. కేసు నమోదు చేసి నెలరోజులపైనే అవుతున్నా అడుగు కూడా ముందుకు కదలలేదు.
- ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ఎన్నారై మహిళ బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. అందులో భారీగా నగలు, నగదు ఉన్నాయని ఆమె ఫిర్యాదు చేసినా ఇంత వరకు అతీగతీ లేకుండా పోయింది. విడ్డూరం ఏమిటంటే..ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ చేస్తూ పట్టుబడిన మహిళలను సిబ్బంది అప్పజెప్పిన క్రమంలో ఎటువంటి ఫిర్యాదు లేదని, వారిని వదిలేసిన సంఘటన పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో చోటు చేసుకుంది.
- కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్ వద్ద నివాసం ఉండే ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగుల నివాసంలో చోరీ జరిగి ఆరు నెలల పైనే గడుస్తోంది. 300 గ్రాముల బంగారం, భారీ నగదును దొంగలు దోచుకుపోయారు. ఇప్పటి వరకు కేసులో కనీస పురోగతి లేకపోవడంపై పోలీసుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ క్రైం సిబ్బంది ఉన్నా లేనట్టేనని.. వారికి మిగతా వ్యవహారాల్లో పనులు అధికమైపోయాయని ఆ స్టేషన్ సిబ్బందే బాహటంగా విమర్శిస్తున్నారు.
- గుంటూరు వెస్ట్ పరిధిలోని విద్యానగర్‌లో ఒక జైన్ వ్యాపారి నివాసంలో భారీ చోరీ జరిగింది. సుమారుగా 1200 గ్రాముల బంగారం, నగదు పోయిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. అయినప్పటికీ ఇంత వరకు రికవరీ జరగలేదు.
- నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో సైతం ఒక నివాసంలో అరకిలోకు పైగా బంగారం చోరీ జరిగిన ఘటన చోటు చేసుకున్నా, ఇంత వరకు ఎటువంటి ముందడుగు లేకుండా పోయింది.

క్లుప్తంగా

హెల్త్ పాలసీని వర్తింపజేయాలి



నగరంపాలెం: స్థానిక చుట్టుగుంట కూడలిలోని టుబాకో బోర్డు రైతు భవన్‌లో ఆదివారం భారత పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల వలె హెల్త్ పాలసీ పొగాకు బోర్డులో ఉద్యోగ విరమణ పొందిన వారికి వర్తింపచేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. తద్వారా విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్య ఖర్చులు పొందుతారని అన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వెంకటరావు, మరో ఎనిమిది మంది 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సన్మానించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అసోసియేషన్ అధ్యక్షులు బీఎస్.మిత్ర, సభ్యు లు, హాజరయ్యారు.

జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు

- పెదకాకానిలో 145.2 మి.మీ.
- సగటున 51.8 మి.మీ.



కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గుంటూరు జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా పెదకాకాని మండలంలో 145.2 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా కాకుమాను మండలంలో 8.2 మి.మీ. పడింది. సగటున 51.8 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర మండలంలో 125.6 మి.మీ., దుగ్గిరాల 98.8, మేడికొండూరు 94.4, గుంటూరు పశ్చిమ 74.2, ఫిరంగిపురం 73.2, గుంటూరు తూర్పు 70.2, తాడేపల్లి 43.4, తెనాలి 42.4, చేబ్రోలు 30, వట్టిచెరుకూరు 25.6, తాడికొండ 24.8, తుళ్లూరు 20.6, మంగళగిరి 17.2, ప్రత్తిపాడు 15.2, పెదనందిపాడు 12.4, పొన్నూరు మండలంలో 11.6 మి.మీ. చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ 14వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 74.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 105.7 మి.మీ. నమోదైంది.

కొత్తరెడ్డిపాలెంలో సాధారణ జ్వరాలే..

- డీఎంహెచ్‌వో కె. విజయలక్ష్మి
- స్థానికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



జ్వరంతో బాధపడుతున్న బాలుడి కుటుంబంతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో జ్వరాలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె. విజయలక్ష్మి తెలిపారు. గ్రామంలో ఆదివారం వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రబలిన జ్వరాలు, సాధారణం కంటే కాస్త ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. సీజనల్ జ్వరాల ప్రభావం బలహీనంగా ఉన్న వృద్ధులు, పిల్లలపై ఉంటాయని తెలిపారు. అనారోగ్య సమస్యలున్న వారు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తురకపాలెం బాధితులు మరణించిన వైద్యశాలలో కొత్తరెడ్డిపాలేనికి చెందిన వ్యక్తి మరణించటంతో కలవరం మొదలైందని తెలిపారు. ఇక్కడ జ్వరాల బాధితులంతా సాధారణ మందులతో పూర్తిగా కోలుకున్నారని ఆమె పేర్కొన్నారు. వ్యాధి తీవ్రత అనుమానంతో రక్తపరీక్షలు చేయగా తొమ్మిది మందిలో నలుగురికి నెగిటివ్, ఐదుగురికి జలుబుకు సంబంధించిన స్టెపైలో కోక్కై లక్షణాలు ఉన్నట్లు డాక్టర్లు చెప్పారని వెల్లడించారు. ఇక్కడ సాధారణ జ్వరాలు నమోదైనట్లు తెలిపారు. సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించామని, ఆదివారం రెండు జ్వరాల కేసులు వచ్చాయని చెప్పారు. గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి వై. ఊర్మిళ, శైలజ, డెప్యూటీ ఎంపీడీవో రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి కె. శ్రీనివాస రావు, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం: శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. ఆదివారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హాలులో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. ఏదైనా నేరం జరిగితే వెంటనే స్పందించాలని, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, వారి కదలికలు, జీవన విధానంతో పాటు ఏవైనా అనుమానాలు తలెత్తితే తక్షణమే చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. పేకాట, కోడి పందేలు, మట్కా, సింగిల్ నంబర్ జూదాలను అరికట్టాలని తెలిపారు. ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, వారితో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. చట్ట పరిధిలో వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్లలో ఎక్కువసేపు కూర్చోపెట్టొద్దని తెలిపారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జనరల్ డైరీ, రఫ్ డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కేసు డైరీ ఇతర రికార్డులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో కానిస్టేబుళ్లకు విధులు కేటాయించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ డ్రైవ్, కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), రవికుమార్ (ఎల్/ఓ), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల గ్రామంలో ఉన్న పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్‌లో కామర్స్ గ్రూపు ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ తరగతి కామర్స్ గ్రూపులో మిగిలిపోయిన 19 సీట్లను ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా భర్తీ చేయనున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ విద్యాలయంలో రెండు సంవత్సరాల పాటు ఉచిత విద్య, వసతి, భోజనం వంటి సదుపాయాలను లభిస్తాయని, విద్యార్థులకు ఆర్థిక భారం లేకుండా విద్యను కొనసాగించేందుకు ఇది ఓ సువర్ణ అవకాశం అన్నారు. అయితే కేవలం ఉమ్మడి గుంటూరు జిల్లా వారికే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాకు చెందిన విద్యార్థులైనా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. మొదటిగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

ఆది ఆచార్యులు బ్రాహ్మణులు



ఉపాధ్యాయునికి సత్కారం

నగరంపాలెం: సమాజంలో గురు పరంపరకు మూలం బ్రాహ్మణం అని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(తిరుపతి) ఉప కులపతి ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి అన్నారు. అందుకే ఆది ఆచార్యుల స్థానం బ్రాహ్మణులకే సొంతమని ఆయన పేర్కొన్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీలోని 13 జిల్లాలకు చెందిన 56 మంది బ్రాహ్మణ జాతికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను బ్రాడీపేటలోని బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో సత్కరించి, అవార్డులు అందించారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో సమాఖ్య ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), శారదాంబ, సమాఖ్య ఉపాధ్యక్షులు మంగళంపల్లి అంజిబాబు, రామభద్రుడు, కసలపాటి లక్ష్మీనారాయణ, పేరి శ్రావణ్, కుప్పం ప్రసాద్, కొత్తా ధర్మ సంస్థల అధినేత కొత్తా సుబ్బారావు, గుంటూరు బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి రంగావఝుల లక్ష్మీపతి, పోతావఝుల పురుషోత్తమశర్మ, మాగంటి శాస్త్రి పాల్గొన్నారు.

తెలుగు వికాసంపై కార్టూన్ల పోటీలు

- తెలుగు మహాసభల్లో విజేతలకు బహుమతి ప్రదానం
- అక్టోబర్ 10వ తేదీలోపు పంపాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జనవరిలో గుంటూరు నగరం వేదికగా జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో కార్టూన్ల ద్వారా తెలుగు వికాసంపై పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి వయోపరిమితి లేదని, ఒక్కొక్కరు రెండు కార్టూన్లు చొప్పున పంపవచ్చని పేర్కొన్నారు. కార్టూన్స్ ఏ4 సైజు పేపర్‌పై ఉండాలని, గతంలో ప్రచురితమైనవి పంపరాదని సూచించారు. అక్టోబర్ 10వ తేదీలోపు నిర్వాహకులకు పంపాలన్నారు. విజేతలను అక్టోబర్ 29న ప్రకటించి, తెలుగు మహాసభల్లో బహుమతి ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన కార్టూన్లను 3వ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక వేదిక పైన ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 చొప్పున నగదుతో పాటు ప్రత్యేక బహుమతుల రూపంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ రూ.516 నగదు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్టూన్లను ఛ్చిట్టౌ్ఞజీట్టుజ్చిటజీ2013 ః జ్ఛూఝ్చజీ . ఛొరుకు మెయిల్‌తో పాటు వాట్సాప్ నంబర్ 9866084124కు పంపాలని సూచించారు. పోటీలకు సమన్వయకర్తగా ప్రముఖ కార్టూనిస్ట్ బి.హరి వెంకట రమణ వ్యవహరిస్తారని వెల్లడించారు.

తెలుగు లఘు చిత్రోత్సవానికి 44 చిత్రాలు ఎంపిక

ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న తెలుగు లఘు చిత్రోత్సవానికి 44 చిత్రాలు ఎంపికైనట్లు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 20న ఉదయం 9 గంటల నుంచి గుంటూరులోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ప్రతిభావంతులను చదివించడం సామాజిక బాధ్యత



విద్యార్థులకు ఉపకార వేతన చెక్కులు అందిస్తున్న అవోపా ప్రతినిధులు, ప్రముఖులు

- బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి
- అవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.45 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను చదివించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ చైర్మన్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి తెలిపారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఏపీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 240 మంది విద్యార్థులకు రూ.45 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ దాతల సహాయంతో విద్యార్థులు చక్కగా చదువుకోవాలని తెలిపారు. జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. క్రేన్ గ్రూప్ సంస్థల అధినేత గ్రంథి కాంతారావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుని, ఉద్యోగాల కోసం అన్వేషించకుండా వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని సూచించారు. అవోపా ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మరింత మంది దాతల సహకారంతో పెద్ద సంఖ్యలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు కోటి రూపాయలను ఉపకార వేతనాలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అవోపా నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రతిభావంతులైన పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపా ప్రతినిధులు నాగేశ్వరరావు, పువ్వాడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, పొట్టి శ్రీరాములు. చింతా కృష్ణారావు, రాష్ట్ర మహిళా విభాగ చైర్మన్ నిర్మల, రాధాకృష్ణయ్య, మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ బాలికల చాంపియన్ గుంటూరు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుంటూరు జట్టు

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

బత్తలపల్లి: మండలంలోని రామాపురం జెడ్పీహెచ్‌ఎస్ మైదానం వేదికగా మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల 10వ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీ ఆదివారం ముగిసింది. అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీ చాంపియన్‌షిప్‌ను బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. కాగా, ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో ప్రకాశం జిల్లా జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో తూర్పుగోదావరి, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను ముఖ్యఅతిథులు అందించి, అభినందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోలాటంతో స్థానిక కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ తలారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్రబాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి, చైర్మన్ వెంకట్రావు, జనరల్ సెక్రటరీ బాలాజీ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు ఈశ్వరయ్య, జనరల్ సెక్రటరీ వెంకటేష్, నాయకులు ధర్మవరం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అయ్యప్పనాయుడు, చిలకం మధుసూదన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పురంశెట్టి రవి, గ్రామ పెద్దలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి

- బాణసంచా పేలడంతో చంద్ర సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌లో మంటలు
- ఘటన స్థలంలో రోగులను కాపాడిన పట్టాభిపురం సీఐ
- మంటలు అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది



ఆస్పత్రిలో మంటలు

లక్ష్మీపురం: కొరిటెపాడు గణేష్ నిమజ్జనం ఊరేగింపులో బాణసంచా పేలడంతో చంద్ర సూపర్ స్పెషాల్టీ క్లినిక్‌లో మంటలు చెలరేగిన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటెపాడు సెంటర్‌లోని చంద్ర సూపర్ స్పెషాల్టీ క్లినిక్ వద్ద వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన మండపం నుంచి ఆదివారం రాత్రి విగ్రహం నిమజ్జనానికి బయలుదేరింది. ఈ క్రమంలో బాణసంచాను ఆసుపత్రి సెల్లార్‌లో పెట్టారు. ఊరేగింపుగా బయలు దేరిన గణేష్ విగ్రహం వద్ద బాణసంచా పేల్చడంతో సెల్లార్‌లో నిల్వ ఉంచిన వాటిపై నిప్పు రవ్వలు పడ్డాయి. ఒక్కసారిగా సెల్లార్‌లో ఉన్న బాణసంచా పేలి మంటలు రేగాయి. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో హుటాహుటిన చేరుకుని అగ్నిమాపక శాఖ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆసుపత్రిలో మంటల్లో చిక్కుకున్న రోగులను సిబ్బంది సహాయంతో సీఐ లోపలికి వెళ్లి బయటకు తీసుకొచ్చారు. ఘటన స్థలానికి అగ్నిమాపక శాఖ అధికారి కృష్ణారెడ్డి సిబ్బందితో చేరుకుని ఆసుపత్రిలో ఉన్న మరి కొంతమంది రోగులను రక్షించి, మంటలను అదుపు చేశారు. ప్రాణ నష్టం జరగక పోవడంతో పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు, ఆసుపత్రి నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. ఆసుపత్రిలో 10 మంది రోగులు ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందో చూడాల్సి ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.


కొండవీడు రాజుల సాహిత్యసేవ మరువలేనిది



ఆవిష్కరణ సభలో అతిథులు

నగరంపాలెం: కొండవీడు రాజుల సాహిత్యసేవ మరువలేనిదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ఆదివారం కొండవీడు హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో మహాకవి కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలమ్' నాటకానికి కాటయ వేమారెడ్డి రచించిన 'కుమారగిరి రాజీయమ్' వ్యాఖ్యాన గ్రంథ- ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభకు డాక్టర్ డీఎస్ దీక్షిత్ అధ్యక్షత వహించారు. ఈ గ్రంథాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఈ గ్రంథం కొండవీడు రాజుల సాహిత్య ప్రతిభాపాటవానికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కల్లి శివారెడ్డి గణనీయమైన కృషి చేస్తున్నారని అన్నారు. గ్రంథ సంపాదకుడు మోదుగుల రవికృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కల్లి శివారెడ్డి, గ్రంథ ప్రచురణ కోసం సహకరించిన ఆవుల మురళీధర్ రెడ్డి, ఆవుల సుశీల దంపతులు పాల్గొనగా, డాక్టర్ కాజ సుబ్రహ్మణ్యం నిర్వహణలో కొల్లి అక్షయరెడ్డి నాట్య ప్రదర్శన అలరించింది.

పులిచింతలకు 3,02,629 క్యూసెక్కులు విడుదల



సాగర్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి విడుదలైన వరదనీరు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 15 క్రస్ట్ గేట్లు ద్వారా 3,02,629 క్యూసెక్కులు పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 14 క్రస్ట్ గేట్లు నాలుగు మీటర్లు, ఒక క్రస్ట్‌గేటు 2.5 మీటర్లు ఎత్తు ఎత్తి 3,02,629 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం 75.50 మీటర్లకుగాను 74.58 మీటర్లకు నీరు చేరుకుందన్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి సామర్థ్యం 7.080 టీఎంసీలకుగాను ప్రస్తుతం 6.462 టీఎంసీలు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 61.83 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం విద్యుత్ ప్రాజెక్టులోని రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు వెల్లడించారు. నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం



ప్రసాద్, రాధికలకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యభర్తలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన తెనాలి బాలాజీరావుపేటలో ఆదివారం చోటుచేకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రసాద్, రాధిక దంపతులు కొన్నేళ్లుగా తాపీ పనులు చేసుకుంటూ తెనాలి బాలాజీరావుపేట శివారులో ఉంటున్నారు. అపస్మారకస్థితిలో ఉన్న వీరిని స్థానికులు గుర్తించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రాధిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరు ఘర్షణ పడ్డారని, ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారని స్థానికులు చెబుతున్నారు. త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

డ్రైయిన్‌లో పడి బాలుడి మృతి



ఇషాన్ అహ్మద్(ఫైల్)

నకరికల్లు: డ్రెయిన్‌లో పడి రెండేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని కుంకలగుంటలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మస్తాన్‌వలి, ఖైరాబి దంపతుల కుమారుడు షేక్ ఇషాన్‌అహ్మద్(2). రెండురోజులుగా భారీ వర్షం పడుతున్న క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయం తరువాత తల్లీకొడుకు ఇద్దరూ కలసి తమ ఇంటిముందు నిలబడ్డారు. అప్పటి వరకు భారీ వర్షం పడడంతో వారి ఇంటిముందున్న డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. కొడుకును బయట కూర్చోబెట్టిన తల్లి చీపురుకోసం ఇంట్లోకి వెళ్లి వచ్చింది. ఒక్క నిమిషం వ్యవధిలోనే చిన్నారి ఇషాన్ అహ్మద్ కనిపించకపోవడంతో వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్న సమయంలో రెడ్డిపాలెం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఉన్న చిన్నపాటి వాగులో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వర్షంనీటికి ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్‌లో పడడంతో గల్లంతై ఊపిరాడక మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.